

ఆదర్శంగా నిలవాలి
అంగన్‌వాడీ కేంద్రాలు ఆదర్శంగా నిలవాలని మంత్రి సీతక్క కోరారు. కరీంనగర్ ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో మంత్రి పొన్నంతో కలిసి సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. 8లో▸



బస్‌షెల్టర్ ఏర్పాటు వివాదం
పట్టణంలోని వెల్లుల్ల రోడ్‌లో ఖాదీ ప్రతిష్టాన్‌కు చెందిన స్థలంలో సోమవారం కాంగ్రెస్ నాయకులు బస్‌షెల్టర్ ఏర్పాటుకు యత్నించడం వివాదానికి దారి తీసింది. 8లో▸

గరిష్టం/కనిష్టం
31.0/24.0

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. మధ్యాహ్నం ఎండవేడిమి పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రైతులూ.. జగిత్యాలకు తరలిరండి



బొమ్మెనలో రైతులతో మాట్లాడుతున్న రమేశ్‌రెడ్డి

కథలాపూర్: పంట రుణం రూ.రెండు లక్షలు మాఫీ చేయాలనే డిమాండ్‌తో ఈనెల 4న జిల్లా కేంద్రంలో నిర్వహించే 'చలో కలెక్టరేట్' కార్యక్రమానికి రైతులు అధికసంఖ్యలో తరలిరావాలని రైతు ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు నల్ల రమేశ్‌రెడ్డి కోరారు. సోమవారం కథలాపూర్ మండలం బొమ్మెన, తక్కళ్లపల్లి గ్రామాల్లో రైతులతో సమావేశమయ్యారు. ఈ సీజన్‌లో వరిపంటకు రూ.500 బోనస్ ఇవ్వాలని, రైతులకు ఎకరాకు రూ.15 వేలు రైతుభరోసా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఉద్యమిస్తున్నామని, రైతులు అధికసంఖ్యలో వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు ఐక్యవేదిక నాయకులు పన్నాల తిరుపతిరెడ్డి, పిడుగు ఆనంద్‌రెడ్డి, అల్లూరి బాపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల పెంపునకు పోరాడుదాం



మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

మెట్‌పల్లి: రిజర్వేషన్ల పెంపు కోసం బీసీలంతా సమష్టిగా ఉద్యమించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజాల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. పట్టణంలోని వాసవీగార్డెన్‌లో సోమవారం బీసీల కుల గణనపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభాలో మూడు శాతం ఉన్న వారు రాష్ట్రాన్ని ఏలుతున్నారని, 60శాతం ఉన్న బీసీలు మాత్రం రాజకీయంగా వెనుకబడి ఉన్నారని పేర్కొన్నారు. రాష్ట్ర సాధనలో కీలకంగా వ్యవహరించిన బీసీలు రిజర్వేషన్ల సాధనకు పోరాడాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ, జిల్లా అధ్యక్షుడు నల్ల వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి బొమ్మెల శంకర్, నాయకులు బేరి నరేశ్, రాచమల్ల రాజు, నారోజు రాకేశ్, రంగు సంపత్ తదితరులున్నారు.

మల్యాల పీహెచ్‌సీ తనిఖీ



రిజిస్టర్ తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ సమీయోద్దీన్

మల్యాల: మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో సమీయోద్దీన్ సోమవారం సందర్శించారు. సిబ్బంది హాజరు పట్టికతోపాటు మందుల నిల్వకు సంబంధించిన రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఆస్పత్రిలో సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రిని నూతన భవనంలోకి తరలించేందుకు చేపట్టిన చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఎంఎల్‌హెచ్‌పీ అనూష, హెచ్‌ఈఓ రమేశ్, స్టాఫ్‌నర్స్ మణిమాధురి, తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరుకండి

జగిత్యాల: డీఎస్సీ– 2024లో స్కూల్ అసిస్టెంట్ కేటగిరిలో 1:3 ప్రతిపాదికన తాత్కాలికంగా ఎంపిక కాబడిన అభ్యర్థులు మంగళవారం వాణీనగర్‌లోని టీచర్స్‌భవన్‌లో నిర్వహించే సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరుకావాలని డీఈవో జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్ నుంచి దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకుని, దరఖాస్తును పూర్తి చేసి అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు, గెజిటెడ్ అధికారి ధ్రువీకరించిన సర్టిఫికెట్ కాపీలు (రెండు జతలు) వెంట తెచ్చుకోవాలని సూచించారు. ఈనెల ఒకటిన స్కూల్ అసిస్టెంట్ అన్ని సబ్జెక్ట్‌ల అభ్యర్థులు వెరిఫికేషన్‌కు హాజరు కావాలని సూచించారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి

జగిత్యాలటౌన్: అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుతోపాటు నిత్యావసరాల ధరలు తగ్గించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వెన్న సురేశ్ డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందించారు. నిత్యావసరాల పెరుగుదలతో పేదలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు మునుగూరి హన్మంతు, సుతారి రాములు, శ్రీగాద దేవదాసు, ఎండీ.అక్రం తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ డెవలప్‌మెంట్‌కు అడుగులు

- జగిత్యాలలో 'జుడా'కు నిర్ణయం
- కోరుట్ల, మెట్‌పల్లి పరిధిలోనూ ప్రతిపాదన
- జిల్లాలో రెండు అథారిటీల ఏర్పాటుకు సన్నాహాలు

కోరుట్ల: జిల్లాలో కొత్తగా రెండు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల ఏర్పాటుకు సన్నాహాలు సాగుతున్నాయి. జగిత్యాల మున్సిపాలిటీని ఆనుకుని 15 కిలోమీటర్ల పరిధిలో కొంతమేర పట్టణీకరణ ఆనవాళ్లు ఉన్న గ్రామాల అభివృద్ధికి త్వరలో జగిత్యాల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి (జుడా)కు రూపు ఇవ్వనున్నట్లు సమాచారం. ఈ 'జుడా' పరిధిలో ధర్మపురి, రాయికల్ మున్సిపాలిటీల పరిధిలోని కొన్ని గ్రామాలు చేరనున్నట్లు సమాచారం. దీంతోపాటు కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపాలిటీల పరిధిలో పది కిలోమీటర్ల మేర పట్టణీకరణకు దగ్గరగా ఉన్న గ్రామాలతో మరో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. ఈ రెండు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలకు సంబంధించిన ప్రతిపాదనలు తయారు చేసిన అధికారులు.. ఉన్నతాధికారుల సూచనల మేరకు త్వరలో ప్రతిపాదనలు పంపనున్నట్లు సమాచారం.

పట్టణీకరణ ఆనవాళ్లు ప్రామాణికం

జగిత్యాల, ధర్మపురి, రాయికల్ మున్సిపాలిటీల పరిధిలో 'జుడా' కోసం ప్రతిపాదించారు. ఇందులో జగిత్యాల నుంచి 15 కిలోమీటర్ల రేడియస్ పరిధిలో ఉన్న ధర్మపురి, రాయికల్ మున్సిపాలిటీలతోపాటు మేడిపల్లి, కోరుట్ల మండలాల్లోని కొన్ని గ్రామాలు రానున్నాయి. కోరుట్ల, మెట్‌పల్లి, మున్సిపాలిటీల నుంచి పది కిలోమీటర్ల రేడియస్ పరిధిలో ఉన్న గ్రామాలు అంటే మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండలాలకు చెందిన కొన్ని గ్రామాలతో రెండో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కింద చేర్చనున్నట్లు తెలిసింది. ఈ లెక్కన జిల్లాలో జగిత్యాలకేంద్రంగా ఒక అర్బన్‌డెవలప్‌మెంట్ అథారిటీ, కోరుట్ల, మెట్‌పల్లి కేంద్రాలుగా మరో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారు. మొదట జగిత్యాల పరిధిలోని జుడా ప్రతిపాదనకు ప్రభుత్వం నుంచి అనుమతి వస్తుందన్న అభిప్రాయాలు ఉన్నాయి. తరువాత కోరుట్ల, మెట్‌పల్లి పరిధిలోని రెండో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ విషయంలో కదలిక ఉంటుందని సమాచారం. ఈ రెండు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల పరిధిలోకి నిర్ధారిత రేడియస్ దూరంతోపాటు పట్టణీకరణ ఎక్కువగా ఉన్న సుమారు 50 నుంచి 62 గ్రామాలు చేరే అవకాశాలు ఉన్నాయి. అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి ప్రభుత్వం నుంచి అనుమతి లభిస్తే ఆయా గ్రామాల్లో లేఅవుట్ పర్మిషన్లు, 300 చదరపు గజాలకు మించిన నిర్మాణాలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, పరిశ్రమలు, ఇతరత్రా అనుమతులు అథారిటీ నుంచే పొందే అవకాశం ఉంది. అంతే కాకుండా అథారిటీల పరిధిలోని గ్రామాల అభివృద్ధికి అదనంగా నిధులు వచ్చే అవకాశాలు పుష్కలంగా ఉంటాయి.



> **ప్రతిపాదనలు పంపాం**
>
> ఉన్నతాధికారులు సూచించిన మేరకు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేశాం. ప్రభుత్వం కోరితే వాటిని పంపిస్తాం. జగిత్యాల మున్సిపల్ పరిధిలో ఓ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, కోరుట్ల, మెట్‌పల్లి పరిధిలో మరో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రతిపాదనలు రూపొందించాం.
>
> – శ్రీనివాస్, జిల్లా టౌన్‌ప్లానింగ్ అధికారి

అథారిటీ ఏర్పాటు ఇలా..

జిల్లాలో ప్రతిపాదించిన అర్బన్‌డెవలప్‌మెంట్ అథారిటీలకు కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. అథారిటీ చైర్మన్‌ను అధికార పక్షంలో ఉన్న నేతలను ప్రభుత్వం నియమించే అవకాశాలు ఉన్నాయి. వైస్ చైర్మన్‌గా జిల్లా కలెక్టర్ ఉండనున్నారు. వీరితో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యకలాపాల నిర్వహణకు జిల్లాకు చెందిన వివిధ శాఖల అధికారులు సభ్యులుగా ఉండే అవకాశాలున్నాయి. జుడా ప్రతిపాదనలకు అనుమతి వచ్చిన అనంతరం జుడా అర్బన్ డెవలప్ అథారిటీకి పాలకవర్గం నియామకం జరగనున్నట్లు సమాచారం. వీటికి సంబంధించిన పూర్తి అనుమతులు వచ్చేసరికి కొంత సమయం పడుతుందని అధికార యంత్రాంగం చెబుతోంది.

ఓటరు నమోదుకు ఈసీ గ్రీన్ సిగ్నల్

- ఇక గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ పోరు
- వేడెక్కిన ఉత్తర తెలంగాణ రాజకీయం



సాక్షిప్రతినిధి,కరీంనగర్: పట్టభద్రుల, టీచర్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ప్రక్రియకు ఎలక్షన్ కమిషన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సెప్టెంబర్ 30 నుంచి నవంబర్ 6 వరకు ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగనుంది. డిసెంబర్ 30 తేదీన తుది జాబితా వెల్లడించనున్నారు. ప్రస్తుతం జరగనున్న రెండు ఎమ్మెల్సీ స్థానాలకు సంబంధించి ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, కరీంనగర్‌లలో ఈ ప్రక్రియ సోమవారం నుంచి ఊపందుకుంది. టీచర్, గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో పోటీ పడుతున్న ఆశావహులు ఓటరు నమోదు ప్రక్రియను ముమ్మరం చేశారు. పలు విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో పర్యటిస్తూ ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, కరీంనగర్ జిల్లాలు ఒకప్పుడు నాలుగు జిల్లాలు అయినప్పటికీ ప్రస్తుతం 15 జిల్లాలుగా ఆవిర్భవించాయి. ఈ అన్ని జిల్లాలలోనూ గ్రాడ్యుయేట్లు, పలు పాఠశాలలు, కళాశాలల్లో పనిచేసే బోధనా సిబ్బంది కీలకంగా మారారు. వీరిని ప్రసన్నం చేసుకునేందుకు ఆశావహులంతా పోటీ పడుతున్నారు. పార్టీలతో సంబంధం లేకుండా దాదాపుగా అందరు నాయకులు స్వతంత్ర అభ్యర్థులుగానైనా పోటీచేసే ఉత్సాహంతో ఉన్నారు. నాలుగు ఉమ్మడి జిల్లాల్లో ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహనతో పాటు పలు వర్గాల మద్దతు కూడగట్టే విషయంలో ఉమ్మడి కరీంనగర్ అభ్యర్థులే ముందుండడం గమనార్హం. సోమవారం నోటిఫికేషన్ వెలువడిన దరిమిలా వీరి సంఖ్య మరింత పెరగనుంది.

ఈనెల 9 నుంచి సదరెం శిబిరాలు

జగిత్యాల: జిల్లాలోని దివ్యాంగులకు ఈనెల నుంచి డిసెంబర్ వరకు జిల్లాకేంద్రంలోని ప్రభుత్వాస్పత్రి, మాతాశిశు సంక్షేమ కేంద్రంలో సదరెం క్యాంపులు నిర్వహించనున్నట్లు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాములు తెలిపారు. ఈనెల 9, 16, 23న ఆర్థో, 22న హియరింగ్, 25న ఎంఆర్, ఎంఐ, నవంబర్ 6, 13, 20న ఆర్థో, 22న హియరింగ్, 27న ఎంఆర్, ఎంఐ, డిసెంబర్ 4, 11, 18న ఆర్థో, 13న హియరింగ్, 20న ఎంఆర్, ఎంఐ శిబిరాలను ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 29న విజువల్, నవంబర్ 29న విజువల్, డిసెంబర్ 27న విజువల్ క్యాంపులను మాతాశిశు సంక్షేమ క్యాంపులు ఉంటాయని తెలిపారు. దివ్యాంగులు మీసేవలో చేసుకున్న స్లాట్ బుకింగ్ రశీదు, ఆధార్‌కార్డు తీసుకుని రావాలని, అన్ని ఒరిజనల్ ధ్రువీకరణ పత్రాలు వెంట తీసుకురావాలని సూచించారు.

తెలంగాణ సంస్కృతికి అస్థిత్వం బతుకమ్మ

- మున్సిపల్ ఛైర్‌పర్సన్ అడువాల జ్యోతి
- వేడుకలో పాల్గొన్న జెడ్పీ మాజీ ఛైర్‌పర్సన్

జగిత్యాల: తెలంగాణ సంస్కృతికి అస్థిత్వ సంకేతం బతుకమ్మ అని మున్సిపల్ ఛైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. సోమవారం మహిళా డిగ్రీ కళాశాలలో సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. దేవతలను పూలతో పూజిస్తే ఆ పూలనే పూజించి గౌరవించే సంస్కృతి, సంప్రదాయాలు మన తెలంగాణలో ఉన్నాయని, మన బతుకమ్మ పండగకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందన్నారు. జెడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ.. ఆడబిడ్డలకు ఇది ఎంతో గొప్ప పండగ అని పేర్కొన్నారు. ప్రిన్సిపల్ రామకృష్ణ మాట్లాడుతూ.. సంస్కృతి, ఇక్కడి జీవన విధానాన్ని ప్రతిబింబించేది బతుకమ్మ పండగ అని పేర్కొన్నారు. విద్యార్థులు తీరొక్క పూలను పేర్చి బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో కౌన్సిలర్ చుక్క నవీన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు సంగీతరాణి, సుజాత, శ్రీలత, జమున, సునీత, జ్యోత్స్న, వైస్ ప్రిన్సిపల్ చంద్రయ్య పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలోనూ బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. నోడల్ అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బతుకమ్మ పండగలో అనేక శాస్త్రీయ అంశాలు దాగి ఉన్నాయని పేర్కొన్నారు.




బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు, మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ వసంత, తదితరులు

విద్యా వ్యవస్థ పటిష్టం

- అన్ని మండలాలకు విద్యాధికారుల నియామకం
- ఎఫ్ఏసీగా బాధ్యతలు

జగిత్యాల: విద్యా వ్యవస్థను పటిష్టం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతి మండలానికి ఒక (ఎఫ్ఏసీ) విద్యాధికారిని నియమించేలా చర్యలు తీసుకుంది. ఈ మేరకు జిల్లాలోని 20 మండలాలకు ఎంఈవో (ఫుల్ అడిషనల్ చార్జి)లను కేటాయించింది. ఇప్పటివరకు జిల్లాలో ఒక్క రెగ్యులర్ ఎంఈవో లేకపోవడంతో పీజీ హెచ్‌ఎంలకే బాధ్యతలు అప్పగించారు. ఒక్కొక్కరికి మూడు నుంచి నాలుగు మండలాల బాధ్యతలు చూడాల్సి రావడంతో విద్యావ్యవస్థ పూర్తిగా గాడితప్పింది. ఈ క్రమంలో ప్రభుత్వం అన్ని మండలాలకు పీజీ హెచ్‌ఎంలను ఎంఈవోలుగా నియమిస్తూ ఫుల్ అడిషనల్ చార్జ్ ఇస్తూ బాధ్యతలు అప్పగించింది. దీంతో విద్యావ్యవస్థ గాడిలో పడే అవకాశం ఉంది. 2005 తర్వాత ఎంఈవోల నియామకం నిలిచిపోయింది. అప్పటి నుంచి ఇప్పటివరకు ఎంఈవోలను నియమించలేదు. జగిత్యాల డివిజన్ కేంద్రంగా ఉన్నప్పుడు ఒక రెగ్యులర్ ఎంఈవో మాత్రమే ఉన్నారు. ఎప్పుడూ ఇన్‌చార్జి ఎంఈవోలే ఉండేది. ప్రస్తుత ప్రభుత్వం అన్ని మండలాలకు ఎంఈవోలను నియమించడంతో పర్యవేక్షణ మరింత పెరిగే అవకాశం ఉంది. ఎంఈవోలకు ఎక్కువ మండలాలు ఉండటంతో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మండలాలకు నోడల్ అధికారులను నియమించింది. వీరు పాఠశాలల్లోనే తిరుగుతూ పర్యవేక్షించేవారు. నోడల్ అధికారులకు పూర్తిస్థాయి అధికారాలు లేకపోవడంతో ఉపాధ్యాయులు వారిని లెక్కచేయలేదనే ఆరోపణలు ఉన్నాయి. నోడల్ అధికారులు వచ్చినా పట్టించుకునే పరిస్థితులు లేవు. దీంతో పాఠశాలలో ఆశించిన స్థాయిలో విద్యా వ్యవస్థ పటిష్టం కాలేకపోయింది. విద్యాప్రమాణాలు కుంటుపడ్డాయి. ప్రస్తుతం ప్రతి మండలానికో పీజీ హెచ్‌ఎంను నియమించింది. జిల్లాలో గతంలో 18 మండలాలు ఉండగా గత ప్రభుత్వం భీమారం, ఎండపల్లి మండలాలను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం 20 మండలాలకు 20 మంది ఎంఈవోలను నియమించింది. ఇందులో చాలామంది నోడల్ అధికారులకే విద్యాధికారులుగా ఫుల్ అడిషనల్ చార్జి ఇవ్వగా.. కొంతమంది నోడల్ అధికారులు ఉన్నారు. ప్రభుత్వం నోడల్ అధికారులు ఉన్నట్లా..? లేనట్లా..? అని క్లారిటీ ఇవ్వలేదు. చాలామంది నోడల్ అధికారులకు ఎంఈవోలుగా బాధ్యతలు అప్పగించినా.. జిల్లాలో ఐదుగురు నోడల్ అధికారులు ఉన్నారు. వీరు నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారా..? లేదా..? అన్నది తెలియాల్సి ఉంది.



> **రెగ్యులర్ ఎంఈవోలు ఎప్పుడో..?**
>
> రెగ్యులర్ ఎంఈవోలను ఇప్పట్లో నియమించే అవకాశాలు లేనట్లే ఉన్నాయి. రెగ్యులర్ ఎంఈవోలను నియమిస్తే ప్రస్తుత పీజీ హెచ్‌ఎంలకు పదోన్నతులు లభించడంతోపాటు, డీఎస్సీలో ఉపాధ్యాయుల పోస్టుల సంఖ్య సైతం పెరిగే అవకాశం ఉంది.

పర్యవేక్షణ మెరుగయ్యేనా..?

ప్రభుత్వం రెగ్యులర్ ఎంఈవోలను నియమించకపోవడం.. పీజీ హెచ్‌ఎంలకు బాధ్యతలు అప్పగించడం లేదా.. నోడల్ అధికారులను నియమించడంతో విద్యాప్రమాణాలు మెరుగుపడలేదు. తాజాగా ఎంఈవోలను అన్ని మండలాలకు నియమించడంతో పర్యవేక్షణ మెరుగయ్యే అవకాశాలు ఉన్నట్లు భావిస్తున్నారు. గతంలో ఇన్‌చార్జిలే అధికంగా ఉండటంతో ఎవరికీ పాఠశాలలపై పట్టులేకుండా పోయింది. ప్రస్తుతం ఒక మండలానికి ఒకే ఎంఈవో ఉండటంతో నిత్యం పలు స్కూళ్లను విజిట్ చేసి విద్యావ్యవస్థను పటిష్టం చేసేందుకు చర్యలు తీసుకోవచ్చు.

మండలం ఎంఈవో

మండలం	ఎంఈవో
మల్యాల	ఎస్.జయసింహారావు
జగిత్యాలరూరల్	గాయత్రి
గొల్లపల్లి	జమునాదేవి
కథలాపూర్	ఎల్.శ్రీనివాస్
కోరుట్ల	జి.నారేశం
రాయికల్	ఎస్.రాఘవులు
బీర్‌పూర్	ఎస్.నాగభూషణం
పెగడపల్లి	సులోచనదేవి
కొడిమ్యాల	శ్రీనివాస్
జగిత్యాల అర్బన్	వి.భీమయ్య
వెల్గటూర్	బి.ప్రభాకర్
ఇబ్రహీంపట్నం	బి.మధు
మేడిపల్లి	కె.లలిత
బుగ్గారం	ఎస్.వెంకటేశ్వర్లు
సారంగాపూర్	బి.కిశోర
ఎండపల్లి	జి.రాంచంద్రం
భీమారం	వై.మధుసూదన్‌రెడ్డి
ధర్మపురి	శంకరయ్య
మెట్‌పల్లి	చంద్రశేఖర్
మల్లాపూర్	దామోదర్‌రెడ్డి



> **విద్యా వ్యవస్థ మరింత బలోపేతం**
>
> మండలాలకు పూర్తిస్థాయి ఎంఈవోలను నియమించడంతో విద్యావ్యవస్థ మరింత బలోపేతం అవుతుంది. పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు వస్తాయి. ప్రతి గ్రామంలోని పాఠశాలలను పర్యవేక్షించవచ్చు.
>
> – జగన్మోహన్‌రెడ్డి, ఎంఈవో

ఆలకించండి.. పరిష్కరించండి

- ప్రజావాణికి తరలివచ్చిన బాధితులు
- అర్జీలు స్వీకరించిన అదనపు కలెక్టర్ రాంబాబు
- పరిష్కరించాలని అధికారులకు ఆదేశం

జగిత్యాలటౌన్: కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లావ్యాప్తంగా బాధితులు తరలివచ్చారు. వారి నుంచి జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు అర్జీలు స్వీకరించారు. సుమారు 47 దరఖాస్తులు రాగా వాటిని పరిశీలించిన అనంతరం వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సత్యప్రసాద్ జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో పులి మధుసూదన్‌గౌడ్, కలెక్టరేట్ ఏవో హన్మంతరావు, అధికారులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు

జీపీ భవనం పూర్తి చేయండి



జగిత్యాల రూరల్ మండలం పొలాస మేజర్ గ్రామ పంచాయతీ పాత భవనాన్ని కూల్చివేసి కొత్త భవన పనులు ప్రారంభించారు. తొమ్మిది నెలలు గడుస్తున్నా పునాది దశ దాటలేదు. అద్దె భవనాన్ని తరచూ మారుస్తుండటంతో రికార్డుల భద్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. భవన నిర్మాణాన్ని వెంటనే పూర్తయ్యేలా చూడాలి.

– పొలాస గ్రామస్తులు

ఇందిరమ్మ ఇల్లు ఇప్పించండి



జగిత్యాల ఇందిరమ్మ ఇళ్ల కాలనీలో 2008లో నిర్వహించిన డ్రాలో ఈ 335నంబరుతో నా భార్య ఆడెపు మాధవి పేరుతో ప్రభుత్వం ఇంటి స్థలం కేటాయించింది. నాకు కేటాయించిన స్థలంలో అప్పు చేసి ఇంటిని బేస్‌మెంట్ వరకు నిర్మించుకున్నా. డబుల్ ఇళ్ల నిర్మాణం పేరిట కూల్చివేసిన అధికారులు నాకు ఇల్లు మాత్రం కేటాయించలేదు. ఇందిరమ్మ ఇల్లు కేటాయించి మా కుటుంబాన్ని ఆదుకోండి.

– ఆడెపు శంకర్, జగిత్యాల

'అమ్మ ఆదర్శ' బిల్లు చెల్లించండి



అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను త్వరగా పూర్తిచేయాలని ఒత్తిడి చేసిన అధికారులు బిల్లుల చెల్లింపులో మాత్రం నిర్లక్ష్యం చేస్తున్నారు. చేసిన పనుల కంటే రికార్డులు తక్కువగా నమోదు చేశారు. అప్పు చేసి పనులు పూర్తి చేసిన మాకు బిల్లులు రాక ఇబ్బంది పడుతున్నాం.

– మహిళా సంఘం ప్రతినిధులు, కొడిమ్యాల

నిర్మాణాలు పూర్తి చేయండి



వెల్గటూర్ మండలం శాఖాపూర్‌లో ఏడాది క్రితం ప్రారంభించిన ఖబ్రస్థాన్, మస్జీద్, మైనార్టీ ఫంక్షన్‌హాల్ పనులు సగంలోనే నిలిచిపోయాయి. ప్రభుత్వ నిధులు వృథా కావడంతోపాటు ఖబ్రస్థాన్, మస్జీద్, ఫంక్షన్‌హాల్ లేక ఇబ్బందులు పడుతున్నాం. పనులు పూర్తి చేసేలా సంబంధిత అధికారులను ఆదేశించండి.

– మైనార్టీ ప్రతినిధులు, శాఖాపూర్

బస్సు ట్రిప్పులు పెంచండి



జగిత్యాల నుంచి మేడిపల్లి మండల కేంద్రం మీదుగా గోవిందారం, మోత్కురావుపేటకు గతంలో ఐదు ట్రిప్పులు ఆర్టీసీ బస్సులు నడిచేవి. ప్రస్తుతం మధ్యాహ్నం ట్రిప్పు క్యాన్సిల్ చేయడంతో ఇబ్బంది పడుతున్నాం. మధ్యాహ్నం ట్రిప్పు పునరుద్ధరణతోపాటు మోత్కురావుపేటలో నైట్‌హాల్ట్ బస్ ఏర్పాటు చేసి ప్రజారవాణా మెరుగుపరిచేలా చర్యలు తీసుకోండి.

– ఒడ్డినేని గంగారావు, రంగాపూర్

మిల్లర్ల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

గొల్లపల్లి: రైస్‌మిల్లర్ల సమస్యలను సీఎం, పౌరసరఫరాల శాఖ మంత్రితో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురిలో జిల్లా పారాబాయిల్డ్ రైస్‌మిల్లర్స్ ఆధ్వర్యంలో విప్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా మిల్లర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రంగినేని నవీన్‌రావు మాట్లాడుతూ రైస్‌మిల్లర్ల సమస్యలను విప్ దృష్టికి తీసుకొచ్చారు. రైతులు పండించిన పంట కొనుగోలుకు మిల్లర్లు సహకరించాలన్నారు. బీఆర్ఎస్ హయాంలో తప్ప, తాలు పేరిట అన్యాయం జరిగిందని, అలాంటివి పునరావృతం కానివ్వొద్దని సూచించారు. మిల్లర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు దినేశ్, చిలుముల లక్ష్మణ్, మిల్లర్లు సాయిని శ్రీనివాస్, వినోద్‌రావు, కోటయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్

క్లుప్తంగా

గుండెపోటుతో యువకుడు మృతి


నవతేజ(ఫైల్)

మెట్‌పల్లిరూరల్(కోరుట్ల): మెట్‌పల్లి మండలం మెట్లచిట్టాపూర్‌కు చెందిన వన్నెల నవతేజ(28) గుండెపోటుతో మృతిచెందాడు. స్థానికుల వివరాలు.. గ్రామంలో వాటర్ ప్లాంట్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్న నవతేజకు ఆదివారం అర్ధరాత్రి ఇంట్లో గుండెపోటు వచ్చింది. కుటుంబసభ్యులు హుటాహుటిన మెట్‌పల్లిలోని ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా నవతేజకు ఇటీవలే వివాహం నిశ్చయమైనట్లు తెలిసింది. యువకుడి మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

రుణాలతో ఆర్థికాభివృద్ధి సాధించాలి


మహిళలు ఏర్పాటు చేసుకున్న యూనిట్లను పరిశీలిస్తున్న సాయితేజ్‌రెడ్డి

జగిత్యాలరూరల్: మహిళలు బ్యాంక్ రుణాలతో ఆర్థికాభివృద్ధి సాధించాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారి సాయితేజ్‌రెడ్డి అన్నారు. సోమవారం జగిత్యాల రూరల్ మండలం పొరండ్లలో మహిళా సంఘ సభ్యులతో ముఖాముఖీ సమావేశం నిర్వహించారు. బ్యాంక్ ద్వారా తీసుకున్న రుణాలతో స్వయం ఉపాధి యూనిట్లు నెలకొల్పుకోవాలన్నారు. మహిళాసంఘాలు ఆర్థికంగా ఎదిగేందుకు బ్యాంకులు కృషి చేస్తున్నట్లు వివరించారు. పొదుపు చేసుకుని కుటుంబానికి ఉపయోగపడేలా ప్రణాళిక రచించుకోవాలన్నారు. మహిళాశక్తి యూనిట్లను పరిశీలించారు. కేడీసీసీ బ్రాంచ్ మేనేజర్ ఎండీ.మోయిజ్‌బాషా, లీడ్ బ్యాంక్ ట్రైనర్ మధుసూదన్, ఏపీఎం గంగాధర్, సీసీ రవీందర్, వీవోఏలు రమ, సత్య, మహిళాసంఘం అధ్యక్షురాళ్లు పడాల జ్యోతి, మమత పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **KONAPARTHI ROJA** D/o. **KONAPARTHI RAJENDHAR** (Old Name), Beedi Roller, shall henceforth be known as **NARUKULLA ROJA** W/o. **RAMESH** (New Name).
- **KONAPARTHI ROJA**

డీఎస్సీలో మెరిశారు

రాష్ట్ర ప్రభుత్వం సోమవారం విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో పేదింటి కుసుమాలు మెరిశాయి. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని పలువురు వ్యవసాయ, పేద కుటుంబాలకు చెందినవారు మంచి మార్కులు సాధించి వారి కుటుంబాల్లో ఆనందం నింపారు. కొందరు వైకల్యాన్ని జయించి సత్తాచాటారు.

జిల్లాస్థాయిలో ఫస్ట్‌ర్యాంక్


రవికుమార్

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): మండలంలోని కోజన్‌కొత్తూర్‌కు చెందిన అయితే రవికుమార్ స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ విభాగంలో జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు సాధించాడు. ప్రస్తుతం నిజామాబాద్ జిల్లా మోర్తాడ్‌లోని జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. గ్రామానికి చెందిన అయితే రాములుకు ఇద్దరు కుమారులు. వీరిది వ్యవసాయ కుటుంబం. పెద్ద కుమారుడు మహేందర్ కొంత కాలం క్రితం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిగా ఎంపికయ్యాడు. రెండో కుమారుడైన రవికుమార్ ఉస్మానియా యూనివర్శిటీ నుంచి పీజీ(ఇంగ్లిష్) పూర్తి చేశాడు. డీఎస్సీలో ఎంపికతో గురుకుల పోస్టుకు రాజీనామా చేసి ప్రభుత్వ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా జాయిన్ అవుతానని రవికుమార్ పేర్కొన్నారు.

పేద కుటుంబంలో విద్యాకుసుమం


రజిత

గన్నేరువరం(మానకొండూర్): మండలంలోని చీమలకుంటపల్లెకు చెందిన తాళ్లపెల్లి రజిత 7వ ర్యాంకు సాధించింది. తండ్రి రాజయ్యగౌడ్ కులవృత్తి, తల్లి రాధ కూలీ పనులు చేస్తుంటారు. 1 నుంచి 5వ తరగతి గ్రామంలో, 10వ తరగతి వరకు వడ్లూరుబేగంపేట్ ప్రభుత్వ పాఠశాలలో చదివింది. పదిలో 526 మార్కుల సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచింది. ఇంటర్ గుండ్లపల్లి స్టేజీ వద్ద సద్గురు కళాశాల, డీఈడీ తిమ్మాపూర్ మండలం రామకృష్ణాకాలనీ జ్యోతిష్మతి (షాలినీ కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్)లో పూర్తి చేసింది. టీఈటీలో 133 మార్కులు సాధించింది. డీఎస్సీలో జిల్లాలో ఏడో ర్యాంకుతో సత్తా చాటింది. కాగా ఐదేళ్ల క్రితం ఇల్లంతకుంటకు చెందిన అంతటి చందుగౌడ్‌తో వివాహం జరిగింది. భర్త ట్రావెల్స్ నిర్వహిస్తున్నాడు.

ధర్మపురి వాసుల ప్రతిభ

గొల్లపల్లి(ధర్మపురి): డీఎస్సీలో ధర్మపురి అభ్యర్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. స్కూల్ అసిస్టెంట్ తెలుగులో మాడిశెట్టి అభిషేక్ జిల్లా మొదటి ర్యాంక్, గడిపల్లి మమత ఎస్జీటీ విభాగంలో 11వ ర్యాంక్, మెరుగు రామచంద్రం తెలుగులో 4వ ర్యాంక్ సాధించారు. మొదటి ర్యాంక్ సాధించిన అభిషేక్ టైలర్ వృత్తి చేస్తున్నాడు.

అంధత్వాన్ని జయించి..


రేవతి

సిరిసిల్ల ఎడ్యుకేషన్: రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం భీముని మల్లారెడ్డిపేటకు చెందిన పాతూరి రేవతి డీఎస్సీ ఫలితాల్లో సెకండరీ గ్రేడ్ టీచర్ విభాగంలో జిల్లా రెండో ర్యాంకు సాధించింది. పేద వ్యవసాయ కుటుంబానికి చెందిన పాతూరి శ్రీనివాస్‌రెడ్డికి ఇద్దరు కూతుర్లు. చిన్నమ్మాయి రేవతి పుట్టుకతో వంద శాతం అంధత్వం. మూడో తరగతి వరకు గ్రామంలో చదివింది. బాబాయ్ పాతూరు మహేందర్‌రెడ్డి ఉపాధ్యాయుడు కావడంతో రేవతిలో ఉన్న జ్ఞానాన్ని గ్రహించి కరీంనగర్‌లోని అంధుల పాఠశాలలో చేర్పించారు. హైదరాబాద్‌లో ఇంటర్, గ్రాడ్యుయేషన్, టీటీసీ(డీఎడ్) పూర్తి చేసింది. టెట్‌లో మంచి మార్కులు పొంది ప్రస్తుతం డీఎస్సీలో జిల్లాలో రెండో ర్యాంకు సాధించింది. తన తండ్రి, అక్క, బావ ప్రోత్సాహంతో ఇది సాధ్యమైనట్లు తెలిపింది.

ఆరోసారికి దక్కిన విజయం


చంద్రశేఖర్

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలం హన్మాజిపేటకు చెందిన కోడం చంద్రశేఖర్ ఐదు సార్లు డీఎస్సీ రాసినా ఫలితం లేకపోవడంతో నిరాశ చెందలేదు. పట్టుదలతో ఆరోసారి రాసిన పరీక్షల్లో జిల్లా టాపర్‌గా నిలిచాడు. పేద చేనేత కుటుంబంలో జన్మించిన ఆయన ఎన్నో ఒడిదుడుకులను ఎదిరించారు. ప్రస్తుతం వేములవాడ బీసీ గురుకులంలో టీజీటీ సోషల్ సబ్జెక్టు బోధిస్తున్నాడు.

వ్యాయామ విద్యా విభాగంలో..


అఖిల్

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్ జిల్లా చింతకుంటకు చెందిన వి.పూర్ణసాయి అఖిల్ వ్యాయామ విద్య విభాగంలో 55 మార్కులు సాధించి జిల్లాలో 2వ ర్యాంకు సాధించాడు. అఖిల్‌ను జిల్లా క్రీడలు యువజన అధికారి శ్రీనివాస్‌గౌడ్, జిల్లా అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తుమ్మల రమేశ్‌రెడ్డి, మహ్మద్ కరీం, ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, కోశాధికారి సిద్ధారెడ్డి అభినందించారు.

సామాన్య కుటుంబం నుంచి..


నివేదితరెడ్డి


ప్రజ్ఞారెడ్డి


నాగరాజు


నరేందర్‌రాజు

మల్లాపూర్(కోరుట్ల): సామాన్య కుటుంబానికి చెందిన పలువురు డీఎస్సీ ఫలితాల్లో మెరిశారు. మండలంలోని చిట్టాపూర్‌కు చెందిన గుగ్గిళ్ల గంగారాం–లక్ష్మి దంపతుల కుమారుడు నాగరాజు ఎస్జీటీ విభాగంలో ఫస్ట్ ర్యాంక్ సాధించాడు. అదే గ్రామానికి చెందిన గణపతి నరేందర్‌రాజు స్కూల్ అసిస్టెంట్(సోషల్) విభాగంలో జిల్లా సెకండ్ ర్యాంక్ సాధించాడు. అలాగే నడికుడ గ్రామానికి చెందిన కోరిపెల్లి నర్సారెడ్డి–కాంతమ్మ దంపతుల కుమార్తె నివేదిత ఎస్జీటీ విభాగంలో 4వ ర్యాంక్, అదే గ్రామానికి చెందిన కోరిపెల్లి ప్రజ్ఞ ఎస్జీటీలో 77వ ర్యాంక్ సాధించారు.

మొదటి ప్రయత్నంలోనే సక్సెస్


తల్లిదండ్రులతో శ్రీకాంత్

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని మామిడిపల్లికి చెందిన బెదిరె శ్రీకాంత్ డీఎస్సీలో మొదటి ప్రయత్నంలోనే విజయం అందుకున్నాడు. జిల్లా స్థాయిలో ఫస్ట్‌ర్యాంక్ సాధించాడు. గ్రామానికి చెందిన బెదిరె కుంటయ్య–మీన దంపతుల కుమారుడు శ్రీకాంత్‌ను గ్రామస్తులు అభినందిస్తున్నారు.

పేదింటి బిడ్డకు రెండో ర్యాంకు


కుటుంబ సభ్యులతో కుమార్

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): మండలంలోని గంగారం గ్రామపంచాయతీ పరిధి ఊశన్నపల్లెకు చెందిన బండారి కుమార్ స్కూల్ అసిస్టెంట్ విభాగంలో రెండో ర్యాంకు సాధించాడు. తల్లిదండ్రులు కొమురమ్మ–దుర్గయ్య వ్యవసాయ కూలీలు. ఒకటి నుంచి 10 వరకు ప్రభుత్వ స్కూళ్లలో చదివాడు. 2001–02లో పదిలో 524 మార్కులు సాధించగా, అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్లు నరేందర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి ఇంటర్‌లో ఉచితంగా అవకాశం కల్పించారు. ఆర్థిక పరిస్థితుల కారణంగా అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ దూరవిద్యలో బీఎస్సీ, బీఈడీ, పీజీ చేశాడు. కరీంనగర్ డైట్‌లో టీటీసీ పూర్తి చేసి ఎస్జీటీగా కాల్వశ్రీరాంపూర్ మండలం మల్యాలలో ఉపాధ్యాయుడిగా చేరారు. తన తల్లిదండ్రుల కష్టాలు తెలిసిన వ్యక్తిగా గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల అభ్యుదయం కోసం కృషి చేస్తానని కుమార్ పేర్కొన్నాడు.

వివాదానికి దారి తీసిన బస్‌షెల్టర్ ఏర్పాటు

- ఖాదీ స్థలంలో ఏర్పాటుకు కాంగ్రెస్ నేతల యత్నం
- అడ్డుకున్న బీఆర్ఎస్ నాయకులు


కాంగ్రెస్ నాయకులు ఏర్పాటు చేసిన షెడ్డు

మెట్‌పల్లి: పట్టణంలోని వెల్లుల్ల రోడ్‌లో ఖాదీ ప్రతిష్ఠాన్‌కు చెందిన స్థలంలో సోమవారం కాంగ్రెస్ నాయకులు బస్‌షెల్టర్ ఏర్పాటుకు యత్నించడం వివాదానికి దారి తీసింది. ఉదయం షెల్టర్ ఏర్పాటు కోసం కాంగ్రెస్ నాయకులు స్థలం వద్దకు వెళ్లి ఏర్పాట్లు చేస్తుండగా.. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు అక్కడకు వెళ్లి అడ్డుకున్నారు. ఖాదీ అనుమతి లేకుండా షెల్టర్ ఎలా ఏర్పాటు చేస్తారని కాంగ్రెస్ నాయకులను నిలదీశారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అక్కడే ఉన్న పోలీసులు జోక్యం చేసుకొని గొడవను సద్దుమణిగించారు. అనంతరం డీఎస్పీ ఉమమాహేశ్వర్‌రావు రెండు పార్టీల నాయకులతో సమావేశమై ఇరువైపులా అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. సమస్యను సంబంధిత అధికారులతో కలిసి సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని వారికి సూచించారు. రాత్రి సమయంలో కాంగ్రెస్ నాయకులు నేరుగా సామగ్రితో వెళ్లి షెల్టర్ ఏర్పాటు పనులను ప్రారంభించారు. కొంత పూర్తయిన తర్వాత బీఆర్ఎస్ నాయకులు వచ్చి అడ్డుకున్నారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో సీఐ నిరంజన్‌రెడ్డి సిబ్బందితో వచ్చి ఇరు పార్టీల నాయకులను అక్కడి నుంచి పంపించారు. షెల్టర్‌కు జువ్వాడి రత్నాకర్‌రావు పేరు పెట్టాలని కాంగ్రెస్ నాయకులు భావిస్తున్నారని, దీనికి తాము ఒప్పుకోబోమని బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు. అనుమతి తీసుకున్న తర్వాత మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి రాములు పేరుగాని, మెట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన ఇతర నాయకుల పేర్లుగాని పెట్టాలని సూచించారు. తహసీల్దార్ శ్రీనివాస్, కమిషనర్ మోహన్ వెళ్లి షెడ్డును పరిశీలించారు. గొడవలు జరగకుండా షెడ్డు వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

పేద విద్యార్థుల ఉన్నత చదువులకు రూ.1.53 లక్షలు సాయం

- ఫేస్‌బుక్ మిత్రుల ఔదార్యం


ధర్మపురిలో ఆర్థిక సాయం అందజేస్తున్న సీఐ

ధర్మపురి: కొన్నేళ్ల క్రితం భర్తను కోల్పోయి.. కూలీ పనులు చేస్తూ వచ్చిన కొద్దిపాటు సొమ్ముతోపాటు దాతల అందిస్తున్న చిరు సాయంతో ముగ్గురు పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తూ తీవ్ర ఇబ్బంది పడుతున్న ఓ పేద మహిళాకుటుంబానికి ఫేస్‌బుక్ మిత్రులు రూ.1.53లక్షలు సాయం అందించి వారి ఔదార్యాన్ని చాటుకున్నారు. ఎండపల్లి మండలం రాజారాంపల్లెకు చెందిన దర్శనాల జమున, రాజేశ్ దంపతులకు ఇద్దరు కుమారులు, కూతురు సంతానం. రాజేశ్ 15 ఏళ్ల క్రితమే చనిపోయాడు. అప్పటినుంచి జమున పిల్లలను పోషిస్తూ చదివిస్తోంది. కూతురు నల్గొండ జిల్లాలో ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతోంది. ఓ కుమారుడు బీటెక్ ద్వితీయ, మరొకరరు ఎంబీఏ ఫైనలియర్ చదువుతున్నారు. ప్రభుత్వ కోటాలో సీట్లు సాధించినప్పటికీ వసతి గృహాల ఫీజులు, బుక్స్ ఇతర ఖర్చులు భారంగా మారాయి. వీరి దీనస్థితిని తెలుసుకున్న ధర్మపురికి చెందిన సామాజిక సేవకుడు రేణికుంట రమేశ్ పేద విద్యార్థుల చదువు ఖర్చులకు సాయం అందించాలని కోరుతూ సెప్టెంబర్ 3న ఫేస్‌బుక్‌లో పోస్టు చేశారు. స్పందించిన తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎన్నారైలు, ఇతర దాతలు జమున బ్యాంకు ఖాతాకు రు.1.53 లక్షలు విరాళాలుగా అందించారు. ప్రస్తుత ఖర్చులకు వాటిలో కొంత మొత్తాన్ని స్థానిక ఎస్సై మహేశ్ యూనియన్ బ్యాంకు మేనేజర్ ఆశిష్‌తో కలిసి సీఐ రాంనర్సింహారెడ్డి చేతుల మీదుగా జమునకు అందించారు. మిగిలిన డబ్బులు జమున బ్యాంకు ఖాతాలో డిపాజిట్ చేసినట్లు రమేశ్ పేర్కొన్నారు.

ప్రజలకు సమర్థవంతమైన సేవలందించాలి


మాట్లాడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాలక్రైం: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజలకు సమర్థవంతమైన సేవలందించాలని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో నేరాలపై సమీక్షించారు. పెండింగ్ కేసులను త్వరగతిన పరిష్కరించాలని అవసరమైతే న్యాయమూర్తులను కలిసి చొరవ చూపాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. పోక్సో కేసుల్లో విచారణ వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. దొంతనాల నిర్మూలనకు పెట్రోలింగ్ వ్యవస్థను పటిష్టం చేయాలన్నారు. గంజాయి రవాణాను నియంత్రించాలన్నారు. ఈనెల 4న ప్రారంభం కానున్న దుర్గ నవరాత్రి వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకునేలా అధికారులు కృషి చేయాలన్నారు. అనంతరం విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన అధికారులు, సిబ్బందిని అభినందించి ప్రశంస పత్రాలు అందజేశారు. అడిషనల్ ఎస్పీ భీంరావు, డీఎస్పీలు రవీంద్రకుమార్, రఘుచందర్, ఉమామహేశ్వర్‌రావు, రంగారెడ్డి, సీఐలు శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, రఫీక్‌ఖాన్, వేణుగోపాల్, రాంనర్సింహారెడ్డి, రవి, నిరంజన్ రెడ్డి, ఎస్సైలు, ఐటీకోర్ సిబ్బంది పాల్గొన్నారు.

దెబ్బతిన్న రోడ్లకు నిధులివ్వండి

- కలెక్టర్‌కు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ లేఖ

జగిత్యాల: దెబ్బతిన్న రోడ్లకు నిధులు మంజూరు చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్‌కు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సోమవారం లేఖ రాశారు. ఇటీవలే రోడ్లు భవనాలు, ఇరిగేషన్, మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో సమీక్షించామని, మరమ్మతుకు రూ.కోటి నిధులు అవసరమని ప్రతిపాదనలు రూపొందించామని, ఆ మేరకు నిధులు విడుదల చేయాలని కోరారు.

దరఖాస్తులు ఆహ్వానం

జగిత్యాల: జిల్లాకేంద్ర ఆస్పత్రి ఏఆర్టీ సెంటర్‌లో కాంట్రాక్ట్ ఉద్యోగ నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ రాములు తెలిపారు. కౌన్సిలర్ పోస్టు ఖాళీగా ఉందని, ఎంఎస్‌డబ్ల్యూఎస్, ఎంఏ సోషలజీ కలిగి ఉండాలి, కంప్యూటర్ పరిజ్ఞానం, హెచ్ఐవీ నిర్ధారణలో అనుభవం ఉండాలని పేర్కొన్నారు. పరీక్ష, ఇంటర్వ్యూ పద్ధతిన ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తులను ఈనెల ఒకటి నుంచి ఏడో తేదీ వరకు ఏఆర్టీ సెంటర్ రూంనంబరు 41లో అందించాలని, ఈనెల 11న రాత పరీక్ష, 14న ఇంటర్వ్యూ ఉంటుందని పేర్కొన్నారు.

రేపు ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాక్సింగ్ సెలక్షన్స్

జగిత్యాల: కరీంనగర్‌లో ఉమ్మడి జిల్లా బాక్సింగ్ ఎంపిక పోటీలు ఈనెల రెండో తేదీన జరగనున్నట్లు బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, సంపత్ తెలిపారు. ఈనెల 5, 6 తేదీల్లో హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు సెలక్షన్స్ చేపడుతున్నామని, వివరాలకు 94417 73080 సంప్రదించాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాలు ఆదర్శంగా నిలవాలి


పోషణ ఆరోగ్య జాతర కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు సీతక్క, పొన్నం, ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, తదితరులు

- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళాశిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

కరీంనగర్: పూర్వ ప్రాథమిక విద్యనందిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలు దేశంలోనే ఆదర్శ నిలవాలని మంత్రి సీతక్క కోరారు. కరీంనగర్ ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, ఆయా శాఖల అధికారులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ సెంటర్లలో నూతన సిలబస్‌తో విద్య, నాణ్యమైన ఆహారం అందిస్తున్నామని తల్లిదండ్రులకు చెప్పాలని, పిల్లలను పంపేలా చూడాలన్నారు. గర్భిణులకు నాణ్యమైన భోజనం అందించడంలో రాజీపడొద్దన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే సరుకుల్లో నాణ్యత లేకుంటే కాంట్రాక్టర్ల అనుమతులు రద్దు చేయాలన్నారు. బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు చేయాలన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో పాల్గొన్నవారికి ఈ నెల 4, 5వ తేదీల్లో హైదరాబాద్‌లో అభినందన సభ నిర్వహిస్తామని తెలిపారు. మానకొండూర్‌లో పోషణ ఆరోగ్య జాతర కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ కాంతి వెస్లీ, గ్రామీణాభివృద్ధి కమిషనర్ అనితా రామచంద్రన్, కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి, జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్, పెద్దపల్లి కలెక్టర్ శ్రీహర్ష, రాజన్నసిరిసిల్ల కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, కరీంనగర్ అడిషనల్ కలెక్టర్లు, మహిళా కార్పొరేషన్ చైర్మన్ శోభారాణి పాల్గొన్నారు.

గోదావరిలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం


పవన్‌కుమార్ (ఫైల్)

గొల్లపల్లి(ధర్మపురి): ధర్మపురి మండలం రాయపట్నం గోదావరినదిలో గల్లంతైన యువకుడి మృతదేహం సోమవారం లభ్యమైంది. ఆదివారం కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన ముగ్గురు యువకులు నదిలో స్నానం చేస్తూ గల్లంతు కాగా.. జాలర్ల సాయంతో ఇద్దరు ప్రాణాలతో బయటపడిన విషయం తెలిసిందే. పవన్‌కుమార్ ప్రవాహంలో కొట్టుకుపోయాడు. పోలీసులు గాలింపు చేపట్టి మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడి తల్లిదండ్రులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నృసింహుని దర్శించుకున్న ట్రాన్స్‌పోర్ట్ జాయింట్ కలెక్టర్


రాష్ట్ర ట్రాన్స్‌పోర్ట్ జాయింట్ కలెక్టర్‌కు తీర్థప్రసాదలు అందజేస్తున్న దృశ్యం

గొల్లపల్లి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామిని రాష్ట్ర ట్రాన్స్‌పోర్ట్ జాయింట్ కలెక్టర్ చిగుర రమేశ్ సోమవారం దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం తరపున ఈవో శ్రీనివాస్ స్వాగతం పలికి.. స్వామివారి శేష వస్త్రం, తీర్థప్రసాదాలు అందించారు. అర్చకులు నంబి నర్సింహమూర్తి పాల్గొన్నారు.

రూ.1.76కోట్ల వద్ద ఆగిన అంజన్న తలనీలాల టెండర్

- గతంలో రూ.3.65 కోట్లు
- గతం కంటే రూ.1.89 కోట్లు తగ్గుముఖం
- కమిషనర్ ఆమోదం తెలిపేనా..?

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న ఆలయానికి సంబంధించిన తలనీలాలను ఏడాది పాటు పోగు చేసుకునేందుకు దేవాదాయ శాఖ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంలో సోమవారం కొండగట్టు ఈవో ఎం.రామకృష్ణారావు, దేవదాయ, ధర్మదాయ శాఖ కరీంనగర్ సహాయ కమిషనర్ సుప్రియ ఆధ్వర్యంలో టెండర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరుగురు టెండర్‌దారులు పాల్గొనగా కేవీఎన్ ఎంటర్ ప్రైజెస్ సంస్థ హైదరాబాద్ వారు రూ.1.76 కోట్లకు వేలం పాడినట్లు ఆలయ అధికారులు తెలిపారు. సదరు ధరను కమిషనర్ ఆమోదం కోసం పంపినట్లు ఆలయవర్గాలు తెలిపాయి. కొండగట్టు ఏఈవో అంజయ్య, సూపరింటెండెంట్లు చంద్రశేఖర్, సునీల్‌కుమార్, ఉమామహేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గతం కంటే తగ్గిన వేలం

తలనీలాలకు సంబంధించి కోట్ల రూపాయలతో ముడిపడి ఉన్న వ్యాపారం కావడం, కొత్తవారికి ఈ ఫీల్డ్‌పై ఎలాంటి అనుభవం లేకపోవడంతో ఈ టెండర్లకు కొత్తవారు మొగ్గుచూపడం లేదు. ఆలయాల్లో నిర్వహించే కోట్ల రూపాయల వటెండర్లను దాదాపుగా ఆయా ప్రాంతాల స్థానికులే దక్కించుకుంటారు. తలనీలాల టెండర్ మాత్రం ఎక్కువగా అదే ఫీల్డ్‌లో ఉన్నవారు తప్ప, వేరే వారు దక్కించుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికే 13 సార్లు టెండర్ నిర్వహిస్తే రూ.90 లక్షల నుంచి చివరకు రూ.1.76 కోట్లకు ధర చేరుకుంది. కాగా టెండర్‌దారులు కుమ్మక్కు కావడం వల్లే ధర తగ్గుతుందా అనే విమర్శలు వినిపిస్తున్నాయి.

వివిధ రాష్ట్రాల కంపెనీలకు తెలిసేలా..

తలనీలాలకు సంబంధించి పేపర్ యాడ్స్ కేవలం తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల్లో మాత్రమే ఎక్కువ ప్రచురితమవుతాయి. కానీ, ఇతర రాష్ట్రాల్లో సైతం తలనీలాలకు సంబంధించి ఫ్యాక్టరీలు ఎక్కువగా ఉన్నాయి. వివిధ రాష్ట్రాల్లోని ఫ్యాక్టరీలకు తెలిసేలా యాడ్స్ వేయడం, వారి అడ్రస్‌లకు మెయిల్, పోస్ట్ ద్వారా సమాచారం పంపితే వారు సైతం టెండర్‌లో పాల్గొని ఎక్కువ ధర పలికే అవకాశం ఉంటుంది. వెంటనే సంబంధిత అధికారులు ఈ అంశాలను పరిగణనలోకి తీసుకోవాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

- ప్రముఖ ప్రసిద్ధిగాంచిన కంపెనీలో TEAM-LEADERS జగిత్యాల మరియు చుట్టు ప్రక్కప్రాంతాలలో పనిచేయుటకు M/F కావలెను. Q: 10th ఆపైన. సెల్: 9393055164 [K-1246839]
- ప్రముఖ రియల్‌ఎస్టేట్ కంపెనీలో గోదావరిఖని, మంచిర్యాల, పెద్దపల్లిలో మార్కెటింగ్ చేయుటకు అభ్యర్థులు కావలెను. తగిన జీతం ఇవ్వబడును. సంప్ర॥ సెల్: 8328368270, 9000400037 [K-1253315]
- Suitable B.Sc. Diploma Agriculture and B.Sc. Diploma Horticulture Graduates in Oil Palm Plantation Project in Peddapally District. Salary as per the industry Standards for deserving candidates. Cont: 6360192014 [K-4933]
- కొరియర్‌లో పని చేయుటకు డెలివరీ బాయ్స్ మరియు రిసెప్షనిస్ట్ కావలెను. కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండవలెను. సంప్ర: సెల్: 9542427010, కరీంనగర్. [K-1246842]
- కరీంనగర్ లొకేషన్‌లో పని చేయుటకు ల్యాబ్ మేనేజర్ మరియు పాథాలజిస్ట్‌లు తక్షణమే కావలెను. విద్యార్హతలు: ల్యాబ్ మేనేజర్ - బి.ఎస్సీ, ఎం.ఎస్సీ, పాథాలజిస్ట్ - ఎం.బి.బి.ఎస్., ఎం.డి. (పాథాలజిస్ట్), జీతం: అనుభవాన్ని బట్టి ఉంటుంది. పూర్తి వివరాల కొరకు కాల్ చేయండి. సెల్: 6304987190 (H.R.) [K-1246763]

www.sakshi.com

For Classifieds, Advertisements Contact:
9951602933
9951602824

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.